# వరంగల్ వాయిస్

www.warangalvoice.net


Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 352 | శుక్రవారం | 16 ఆగస్టు 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




# ట్రైసిటీ ఒకే జిల్లా

వివరాలు 2లో..




## వరంగల్, హనుమకొండ జిల్లాలను ఏకం చేయాలె!

### పెరుగుతున్న డిమాండ్

### ఒక్కటవుతున్న విద్యావేత్తలు, ప్రజా సంఘాలు

### ఓరుగల్లును ముక్కలు చేసి అన్యాయం చేశారంటూ మండిపాటు

చారిత్రక నేపథ్యం కలిగిన ఓరుగల్లును ఒక్కటిగానే ఉంచాలన్న డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. ట్రై సిటీ ఒకే జిల్లాలో ఉండాలంటున్న వాదనలు మిన్నంటుతున్నాయి. అశాస్త్రీయంగా వరంగల్, హనుమకొండ జిల్లాలుగా విభజించడంతో పక్కపక్కనే ఉన్నా వేరు వేరు జిల్లా వాసులుగా జీవనం సాగించాల్సిన దుస్థితి నెలకొందన్న భావన వ్యక్త మవుతోంది. రాష్ట్రానికి హైదరాబాద్ తర్వాత రెండో రాజధాని వరంగల్ అని ప్రకటిస్తూనే ముక్కలు, చెక్కలు చేయడంతో అభివృద్ధి అటకెక్కిందంటున్నారు. ఉద్యమాలకు పురిటిగడ్డగా పేరు గడించిన ఓరుగల్లులో ఉద్యమ స్ఫూర్తి దెబ్బతినేలా గత పాలకులు వ్యవహరించారంటూ మండిపడుతున్నారు. రెండు జిల్లాలను ఒక్కటి చేసేందుకు విద్యావేత్తలు, ప్రజా సంఘాలు, పురప్రముఖులు ఒక్కటవుతున్నారు. ఇందుకు పలు రాజకీయ పార్టీలు కూడా తమ మద్దతు ప్రకటిస్తున్నాయి. ఇప్పటికే వరంగల్ మహానగర ఏకీకరణ, పునర్నిర్మాణంపై సభలు, సమావేశాలు, చర్చా వేదికలు నిర్వహిస్తున్నారు. మహారాష్ట్రలోని నాగపూర్ తరహాలో ఈ జిల్లానుకూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలంటూ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

- వరంగల్ వాయిస్, వరంగల్






## గడ్డం కేశవమూర్తికి ప్రతిభ పురస్కారం

ఖిలావరంగల్ ఖుష్ మహల్ లో జరిగిన 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద చేతుల మీదుగా వర్ధమాన రచయిత, సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవమూర్తి ఉత్తమ ప్రతిభ పురస్కారం అందుకున్నారు. జర్నలిజం వృత్తిలో మూడున్నర దశాబ్దాల అనుభవం కలిగిన కేశవమూర్తి అనేక జాతీయ తెలుగు పత్రికలకు సామాజిక, రాజకీయ అంశాలపై వ్యాసాలు రాశారు. అరడజనుకు పైగా పుస్తకాలను రచించారు. -వరంగల్ వాయిస్, వరంగల్




8లో

## మహిళలకు క్షమాపణ చెప్పాలి

### కేటీఆర్ దిష్టి బొమ్మ దహనం




# ట్రైసిటీ.. ఒకే జిల్లా




**వరంగల్, హనుమకొండ జిల్లాలను ఏకం చేయాలె!**

**పెరుగుతున్న డిమాండ్**

**ఒక్కటవుతున్న విద్యావేత్తలు, ప్రజా సంఘాలు**

**ఓరుగల్లును ముక్కలు చేసి అన్యాయం చేశారంటూ మండిపాటు**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** 1200 ఏండ్ల చారిత్రక నేపథ్యం కలిగిన ఓరుగల్లును ముక్కలు, చెక్కలు చేశారు. రాష్ట్ర రెండో రాజధానిగా అభివృద్ధి చేయాల్సిన వరంగల్ నగరాన్ని వరంగల్, హనుమకొండ జిల్లాలుగా విభజించారు. ప్రజల ముంగిట పాలన అంటూ అభివృద్ధిని అటకెక్కించారు. స్వార్థ రాజకీయాలతో గత పాలకులు ఇష్టారీతిగా ముక్కలు చేశారంటున్నారు. విభజించి తీరని అన్యాయం చేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అశాస్త్రీయంగా జరిగిన విభజనతో పక్కపక్కనే ఉన్నా వేరు వేరు జిల్లా వాసులుగా జీవనం సాగించాల్సిన దుస్థితి నగర ప్రజల్లో నెలకొంది.

### అణిచివేత..

తెలంగాణలో ఉమ్మడి వరంగల్ జిల్లా అణిచివేతకు గురైంది. రెండో రాజధానిగా అభివృద్ధి చెందాల్సిన వరంగల్ ఖమ్మం, కరీంనగర్ జిల్లాలకంటే వెనుకబడింది. గత పాలకులు చెప్పిన టెక్స్ టైల్ పార్క్, ఐటీ హబ్ లు ప్రకటనలకే పరిమితమయ్యాయి. విద్య, వైద్యం, పరిశ్రమలు, వ్యాపార రంగాలు అన్ని కుంటుపడిపోయాయి. దీంతో నిరుద్యోగుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఇది ఇలాగే కొనసాగితే వరంగల్ పరిస్థితి మరింత అధ్వాహ్నంగా మారే ప్రమాదం ఉంది. దీంతో సామాజిక వేత్తలు, విద్యావేత్తలు, ప్రజా సంఘాలు ఒక్కటై వరంగల్, హనుమకొండ జిల్లాలను ఒక్కటి చేయాలన్న వాదనను వినిపిస్తున్నారు. ఇందుకోసం ప్రజలను సైతం చైతన్యం చేస్తున్నారు.

### ట్రైసిటీ ఒకే జిల్లాలో..

వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలను కలిపి ట్రైసిటీగా దినదినాభివృద్ధి చెందుతున్న వరంగల్ ను గత పాలకులు వరంగల్, హనుమకొండ జిల్లాలుగా విభజించారు. దీంతో ట్రై సిటీ రెండు ముక్కలైంది. హనుమకొండ జిల్లాలోనే కాజీపేట ఉండగా వరంగల్ ఏకాకిగా మారింది. మొదటి నుంచి వరంగల్ వ్యాపార రంగానికి, హనుమకొండ విద్యా, వైద్య రంగానికి, కాజీపేట రైల్వేస్ కు పెట్టినిల్లుగా వర్ధిల్లుతున్నాయి. నగరం రెండు ముక్కలు కావడంతో విద్య, వైద్య, వ్యాపార, వాణిజ్య రంగాలు చిన్నా భిన్నమయ్యాయి. దీంతో అన్ని రంగాలు కుదేలయ్యాయన్న వాదన వినిపిస్తోంది. దీంతో ట్రైసిటీ ఒకే జిల్లాలో ఉండాలన్న వాదన భలంగా వినిపిస్తోంది.

### ఏకం చేయాలి..

వరంగల్, హనుమకొండ జిల్లాలను తిరిగి ఏకం చేయాలన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఈ మేరకు మేధావులు, విద్యావేత్తలు, ప్రజా సంఘాలు ఒక్కటవుతున్నాయి. వరంగల్ మహానగర ఏకీకరణ, పునర్నిర్మాణంపై సభలు, చర్చలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్య వంతులను చేస్తున్నారు. రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలు మద్దతుగా నిలుస్తున్నాయి. భద్రకాళి గుడి, నిట్, కాకతీయ మెడికల్ కళాశాల, కాకతీయ యూనివర్సిటీ, కాజీపేట జంక్షన్ ఈ ప్రాంతానికి ఖ్యాతిని తీసుకొచ్చాయి. ఈ నాలుగు కూడా ప్రస్తుతం హనుమకొండ జిల్లాలోనే ఉన్నాయి. పేరుకు వరంగల్ జిల్లా అయినా ఈ ప్రాంతంలో అభివృద్ధి సున్నా. దీంతో అన్ని వర్గాల ప్రజలు ఏకమై హనుమకొండ, వరంగల్ జిల్లాలను ఏకం చేయాలని బలంగా కోరుతున్నారు.

# నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు

**జిల్లా కలెక్టర్ సత్య శారదా**





**వరంగల్ వాయిస్, వరంగల్ :** నిబంధనలు పాటించని ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హెచ్చరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా స్థాయి ప్రైవేట్ క్లినికల్ ఎస్టాబ్లిషమెంట్ ఆక్ట్, డెంగ్యూ కేసుల నివారణపై జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ సత్య శారదా చైర్మన్ హోదాలో హాజరై ప్రసంగించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రైవేట్ క్లినిక్ లు, పాలీ క్లినిక్ లు, హాస్పిటల్స్ తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. జిల్లాలోని ఆయుర్వేద, యునాని, హోమియో, సిద్ధ, యోగ, నేచురోపతి వంటి అన్ని ఆసుపత్రులు, క్లినిక్ లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. లేకుంటే వాటిన సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆర్ఎంపీ, పీఎంపీలు పేరుకు ముందు డాక్టర్ అని రాసుకోకుడదన్నారు. వారు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. ఇంజెక్షన్లు, సెలైన్ లు పెట్టరాదని అల్లోపతీ వైద్యం చేయరాదని వారి దగ్గర మందుల నిల్వ ఉంచుకోరాదని ఆమె తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోంలలో ఆయుష్ వైద్యులని డ్యూటీ మెడికల్ ఆఫీసర్ గా కానీ వైద్యం చెసేందుకు నియమించుకో కూడదన్నారు. విదేశాలల్లో వైద్య విద్య అభ్యసించిన డాక్టర్లు తప్పనిసరిగా ఎఫ్ఎంజీఈ టెస్టులో ఉతీర్ణులై, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ లో రిజిస్ట్రేషన్ చేయించుకొని తర్వాతనే ప్రాక్టీస్ మొదలు పెట్టాలన్నారు. జిల్లాలో తనిఖీ బృందాలు నిరంతరం క్లినిక్ లు, ఆస్పత్రులు, తనిఖి చేస్తుంటాయని, తనిఖీ అధికారులకు అనుమతుల ధ్రువపత్రాలు సర్టిఫికెట్లు, సిబ్బంది వివరములు, ధరల వివరాలు, చూపించవలెనని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను నేటి నుంచి అమలు చేస్తామని ఎవరైనా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ పీసీపీఎన్ డీటీ ఆక్ట్ లకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపైన చట్టరీత్య చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటరమణ పీపీటీ ప్రెజెంటేషన్ చేసి జిల్లాలో ఉన్న డెంగ్యూ కేసుల వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎంజీఎం సీకేఎం కంటి ఆసుపత్రి సూపరరింటెండెంట్లు, ఐఎంఏ ట్రెజరర్, ప్రోగ్రాం అధికారులు, డిప్యూటీ డీఎంహెచ్ వోలు, ప్రైవేట్ హాస్పిటల్ వైద్యులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# బాసరలో కడియం దంపతులు



**వరంగల్ వాయిస్, బాసర :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, చదువుల తల్లి కొలువైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారిని శుక్రవారం స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి దంపతులు, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బాసర చేరుకున్న వీరిని ఆలయ ఈఓ విజయ రామరావు, అధికారులు, అర్చకులు మంగళవాయిద్యాలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వీరి వెంట బాసర కాంగ్రెస్ నాయకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మూడో రోజుకు చేరిన జూడాల నిరసన




**వరంగల్ వాయిస్, ఎంజీఎం :** కోల్ కతాలో జూనియర్ డాక్టర్ అత్యాచారం, హత్యను నిరసిస్తూ జూడాలు నిర్వహిస్తున్న నిరసన శుక్రవారం మూడో రోజుకు చేరుకుంది. హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి నుంచి వరంగల్ కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పబ్లిక్ గార్డెన్స్ లో ధర్నా నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి అత్యాచారానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసనకు మద్దతుగా హనుమకొండలోని ప్రైవేట్ అసుపత్రులు వైద్యులు, మానవ హక్కుల వేదిక ప్రతినిధులు నిలిచారు. వరంగల్ కలెక్టరేట్ ఎదుట నినదించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవిని కలిసి వినతి పత్రం అందజేశారు.

# తెలంగాణ మహిళలపై కేటీఆర్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

**మహిళ లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలి**
**కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి**



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మహిళలను కించపరిచే విధంగా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని శాయంపేట కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి మండిపడ్డారు. కేటీఆర్ మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ శాయంపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు బుచ్చిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల మహిళల కోసం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటే, ఓర్వలేని కేటీఆర్ మహిళలపై సంస్కారం లేకుండా మాట్లాడినందుకు ముక్కు నేలకు రాసి రాష్ట్ర మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికలలో ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా తన ప్రవర్తనలో మార్పు లేదని, అహంతో వెటకారంగా మాట్లాడితే మహిళలు తరిమికొడతారని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆడబిడ్డలను ఎంతో గౌరవంగా చూసుకునే రాష్ట్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మహిళలపై బాధ్యత లేకుండా మాట్లాడి యావత్ తెలంగాణ మహిళా లోకానికి మచ్చ తెచ్చారని విమర్శించారు. రాష్ట్ర మహిళలపై మాట్లాడే ముందు తన కుటుంబంలోని మహిళలు కూడా ఇదే రాష్ట్రంలో ఉన్నారని మర్చిపోవద్దని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికార ప్రతినిధి చిందం రవి, మండల నాయకులు వైనాల కుమారస్వామి, దుబాసి కృష్ణమూర్తి, మారపెల్లి రవీందర్, రఘుపతి రెడ్డి, ప్రకాష్ రెడ్డి, డీటీ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు చింతల రవిపాల్, మారపెల్లి రాజు, మండల ఉపాధ్యక్షుడు మారపల్లి కట్టయ్య, ఎయిర్ కొండ శంకర్, చిరంజీవి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## కుమారస్వామికి ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, దుగ్గొండి :** మండలం విద్యా వనరుల కేంద్రం దుగ్గొండిలో విధులు నిర్వహించిన కాంట్రాక్టు ఉద్యోగి ఈరసరపు కుమారస్వామి పదవీ విరమణ సందర్భంగా తోటి ఎమ్మార్సీ సిబ్బంది గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం సిబ్బంది మాట్లాడుతూ కుమారస్వామి విధుల్లో చాలా క్రమశిక్షణతో, పని పట్ల శ్రద్ధ, అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. వారి విశ్రాంత జీవితం ఆయురారోగ్యాలతో బాగుండాలని ఎమ్మార్సీ సిబ్బంది ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఎంఐఎస్ సీఓ గీత, సీఓ కృష్ణ, ఐఈఆర్పీలు కుసుమ రవి, చంద సంజీవ్ కుమార్, సీఆర్పీలు శోభన్ బాబు, భాస్కర్, సరిత, అరుణ, మెసెంజర్ సతీష్ లు పాల్గొన్నారు.

## ఏఎస్ఓ విజయ్ కుమార్‌కు అవార్డు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా విద్యా శాఖలో పనిచేయుచున్న అసిస్టెంట్ స్టాటిస్టికల్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్ కు జిల్లా మంత్రి కొండా సురేఖ మరియు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా అవార్డు బహూకరణ జరిగింది. సమగ్ర శిక్షలోని అమ్మ ఆదర్శ పాఠశాల సివిల్ పనులు, యుడైస్, విద్యార్థుల ముఖ హాజరు, విద్యాశాఖకు సంబంధించిన అనేక స్టాటిస్టికల్ డాటా నుసమన్వయ పరిచే పనులను సమర్థవంతంగా నిర్వహించినందుకు గాను, ఈ అవార్డు బహుకరణ జరిగింది. ఇంచార్జి జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, సమగ్ర శిక్ష సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

## కామిడ్రి పవన్‌కు ఉత్తమ ఉద్యోగి అవార్డు



**వరంగల్ వాయిస్, జనగామ :** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ విప్ అండ్ ఆలేరు ఎమ్మెల్యే బీరెల్లి ఐలయ్య, జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ షేక్ రిజ్వాన్ బాషా నుంచి కామిడ్రి పవన్ బాబు ఉత్తమ ఉద్యోగి అవార్డును అందుకున్నారు.

## విద్యార్థుల ప్రభాత భేరి ర్యాలీ



**వరంగల్ వాయిస్, గొరికొత్తపల్లి :** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జడ్పీహెచ్ఎస్ గొరికొత్తపల్లి ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రభాత భేరి పేరుతో ఊరంతా ర్యాలీ తీశారు. వాడ వాడలా వెలసిన జెండాలను ఎగురవేస్తూ సాగారు. తర్వాత జడ్పీహెచ్ఎస్ గొరికొత్తపల్లిలో మువ్వన్నెల జెండా ఎగురవేసి సమావేశమయ్యారు. విద్యార్థులకు సతీష్ (డీఆర్డీఏ) రూ. 4000 విలువ చేసే డిక్షనరీలను ఉచితంగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత మాట్లాడుతూ పేద విద్యార్థులకు చదువులో ఉపయోగపడే సామాగ్రి ఉచితంగా ఇస్తూ దాతల నుంచి కూడా విరాళాలు సేకరించి సహకారం అందిస్తున్న జోరు సంజీవరావుకు కృతజ్ఞతలు తెలిపారు. మన రాష్ట్రంలో లేనప్పటికీ సతీష్, వారి మామ చిరంజీవి ద్వారా డిక్షనరీలు ఇప్పించడం హర్షణీయమన్నారు. విద్యార్థులు భావి భారత పౌరులు కాబట్టి, జాగ్రత్తగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు విజేందర్, సంజీవయ్య, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సమైక్యతను చాటుదాం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం మండలంలో ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దార్ శ్వేత రావు, పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎన్.సందీప్ కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ప్రాథమిక ఆరోగ్య ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ హిమబిందు, గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లు, ప్రభుత్వ కార్యలయాలు, విద్యాలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద మండల పార్టీ అధ్యక్షులు ఇప్పకాయాల నరసయ్య, టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అంకం రాజేందర్, బీజేపీ అధ్యక్షుడు దాసరి తిరుపతి రెడ్డి, కార్మిక సంఘాలు జాతీయ జెండాను అధికారులు, ప్రజాప్రతినిధులు,నాయకులు ఎగురవేశారు. అనంతరం స్వీట్స్ పంపిణీ చేశారు. ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో మండల కేంద్రంతో పాటు అయా గ్రామాల ప్రధాన విధుల గుండా జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించి జాతీయ సమైక్యతను చాటుతూ ప్రత్యేకర్షణగా నిలిచారు.

## నాయకులు ఇచ్చిన స్ఫూర్తితో ఎదుగుదాం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమాన్ నగర్ లోని జై హనుమాన్ పరపతి సంఘం ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కందికొండ సదానందం మాట్లాడుతూ మన దేశానికి 15 ఆగస్టు 1947 స్వాతంత్రం వచ్చిందని, మన దేశ ప్రజలు నాయకులు ఇచ్చిన స్ఫూర్తితో మన దేశం ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఆత్మకూరు దేవేంద్ర చారి మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల కష్టాన్ని త్యాగాన్ని మన ప్రతి ఒక్క భారతీయుడు ఎల్లప్పుడూ మర్చిపోకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఓదెల సూర్యనారాయణ, ఉప్పుల రాజు, సముద్రాల రాజేష్, కుంటి మురళీధర్, ధోనికల సుమన్, మట్టేవాడ చంద్రమౌళి, పోతుల ప్రవీణ్, మాటూరి ప్రసాద్, పి మండ నాగరాజు, నరసింహ చారి, మెరుగు రాజేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రియేట్స్ ఎన్ జీఓ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల కృష్ణా కాలనీ వరంగల్ లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. క్రియేట్స్ ఎన్ జీఓ జనరల్ సెక్రటరీ గడ్డం భాస్కర్, వైస్ ప్రెసిడెంట్ ఎంఎన్ మూర్తి పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవంలో పాల్గొని విద్యార్థులకు సందేశం ఇచ్చారు. విజేతలకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా గడ్డం భాస్కర్ మాట్లాడుతు నాణ్యమైన విద్య, నైపుణ్యతో కూడిన విద్య ప్రభుత్వ పాఠశాలలో ఉంటుంది, ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పట్టుదల, నేర్చుకోవాలనే తపన ఎక్కువ గా ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి సమాజాన్ని అర్థం చేసుకొని, మంచి పౌరులుగా ఎదుగాలని పేర్కొన్నారు. ఈ పాఠశాల విద్యార్థులు ప్రముఖ విద్యాసంస్థలైన నిట్, ఉస్మానియాలలో ఇంజినీరింగ్, మెడిసిన్ లకు ఎన్నిక కావడంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. క్రియేట్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎంఎన్ మూర్తి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పోటీ పడి చదువాలని, చిన్న నాటి ఆర్థిక అసమానతలు పోవాలంటే చదువే ఒక్కటే మార్గం అని తెలిపారు. పాఠశాల స్థాయిలో ఈ సంస్థ నిర్వహించిన పోటీ విజేతలకు నగదు బహుమతి అందచేశారు. వ్యాసరచన వర్తమాన కాలంలో నైపుణ్యఅభివృద్ధి ప్రాధాన్యత –పాఠశాల విద్యార్థుల బాధ్యత మొదటి బహుమతి డి.నరసింహ రూ.1500, ద్వితీయ బహుమతి సీహెచ్ రమ్యశ్రీ రూ.1000, తృతీయ బహుమతి బట్టి విష్ణువర్ధన్ సింగ్ రూ.500, ఉపన్యాస పోటీలో ఆరోగ్య సమాజ నిర్మాణం –విద్యార్థుల కర్తవ్యం ప్రథమ బహుమతి బట్టి విష్ణువర్ధన్ సింగ్ రూ.1500, ద్వితీయ బహుమతి ఎండీ ముదశిర్ రూ.1000, తృతీయ బహుమతి ఎన్.నివేదిత రూ.500, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంప అశోక్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ బండి సుజాత, ఉపాధ్యాయలు, విద్యార్థుల పాల్గొన్నారు.

# 22 నుంచి సీపీఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు

హాజరు కానున్న
జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తెలంగాణ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 22 నుంచి 24 వరకు మూడు రోజుల పాటు హనుమకొండలో జరుగనున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చారిత్రక నగరం హనుమకొండలోని హరిత కాకతీయ హెూటల్ వేదికగా ఈ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డీ. రాజా, జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె. నారాయణ, మాజీ ఎంపీ అజీజ్ పాషా హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై, దేశంలో, రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంతో పాటు భవిష్యత్తు కార్యాచరణను రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజా రెడ్డి, నేదునూరి జ్యోతి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, నాయకులు బాషబోయిన సంతోష్, కొట్టెపాక రవి, జక్కుల రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ వ్యాఖ్యలు తీవ్ర ఆక్షేపణీయం

## మాజీ ఎంపీటీసీ భూక్య లక్ష్మి



**వరంగల్ వాయిస్, బయ్యారం :** మహిళల పట్ల అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే కేటీఆర్ పై బయ్యారం మండలం ఆర్పీ పురం మాజీ ఎంపీటీసీ భూక్య లక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు బ్రేక్ డాన్స్ లు, రికార్డింగ్ డాన్స్ లు చేసుకోవచ్చని కేటీఆర్ అత్యంత జుగూప్సకరంగా మాట్లాడారని మండిపడ్డారు. మీ తండ్రి కేసీఆర్ మీకు నేర్పిన గౌరవం, సంస్కారం ఇదేనా అని ప్రశ్నించారు. మీ ఆడపడుచులు అంతా బ్రేక్ డాన్స్ లు చేస్తున్నారా అంటూ కేటీఆర్ పై ఫైరయ్యారు. మహిళల పట్ల కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని మహిళలకు .. భేషరతుగా కేటీఆర్ తెలంగాణ మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆడవాళ్లను కించపరిచే విధంగా బ్రేక్ డాన్సులు చేసుకోండి అనడం మీ బుర్రలో ఉన్న బురదకు నిదర్శనమని చెప్పారు. గత పది సంవత్సరాలు హైదరాబాద్ లో క్లబ్బులు, పబ్బులు, బ్రేక్ డాన్సులు ఎంకరేజ్ చేసిన చరిత్ర మీదంటూ ఆమె విమర్శించారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని వారి కోసం తాము అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా పేద మహిళలకు రవాణా భారాన్ని తగ్గించేందుకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. శ్రమజీవులు, శ్రామిక మహిళలు ప్రయాణ సమయంలో సమయం వృథా చేయకుండా ఏదోక పని చేసుకుంటే తప్పేంటని అన్నారు. అలాంటి వారిని బ్రేక్ డాన్స్ లు వేసుకోమనడం దుర్మార్గమని వెల్లడించారు. ప్రజలకు ఉపయోగపడే పథకాలు మీకు నచ్చవని, మేము చేస్తే దాని మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

# వైద్య విద్యార్థిపై పాశవిక దాడి సరికాదు

## సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హణుమకొండ :** " వైద్యో నారాయణో హరిః "అన్నారు పెద్దలు అంటే వైద్యులు సాక్షాత్తు ఆ భగవంతునితో సమానం అని అర్థం.. ఇంత పవిత్రమైన వృత్తిలో ప్రజలకు సేవ చేయాలన్న ఉద్దేశంతో పశ్చిమ బెంగాల్ లోని కొలకత్తా ఆర్ జీ కార్ మెడికల్ కళాశాలలో పీజీ చదువుతున్న31 ఏళ్ల వైద్య విద్యార్థిపై అత్యంత పాషవికంగా హత్యాచారం జరిపి హత్య చేసిన సంఘటన దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ సంఘటనను ప్రజలంతా సామూహికంగా ఖండించాల్సిన ఆవశ్యకత ఉందని, ముద్దాయికి కఠిన శిక్ష విధించాలని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. ఐదు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన యావత్ ప్రజలు, మానవతావాదులు ముక్తకంఠంతో ఖండించాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన అన్నారు. దేశంలోని వైద్య విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అందులో భాగంగా మన వరంగల్ నగరంలో కూడా వైద్య విద్యార్థులు ఈ హత్యాచారాన్ని ఖండిస్తూ ఈరోజు అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినట్లు వారికి తన పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతి చెందిన వైద్య విద్యార్థి ఆత్మ శాంతించాలని వారు ఈ సందర్భంగా భగవంతుని ప్రార్థిస్తూ, బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు.

# ప్రభుత్వ భూములను గుర్తించాలి

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, దామెర :** మండల కేంద్రంలో గల ప్రభుత్వ భూములను శుక్రవారం అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. గత పాలకుల నిర్లక్ష్యం వలన కొన్ని ఆస్తులు భూములు విధ్వంసానికి గురైనదని, వాటిని తిరిగి ఉపయోగించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములను గుర్తించి, నూతన ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు అనుగుణంగా నివేదికలు తయారు చేయాలన్నారు. ల్యాదల్ల గ్రామ సమీపంలో నిరుపయోగంగా ఉన్న భవనాలను తిరిగి వాడకంలోకి తెచ్చి, ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అనుగుణంగా వాడుకోవాలన్నారు. అలాగే దామెర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 9:30 కావస్తుండడంతో వైద్యాధికారులు విధులకు హాజరు కాకపోవడంతో ఫోన్ లో వైద్యాధికారులతో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ప్రజలకు ఎల్లవేళలా అండగా కొండా కుటుంబం

## మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజలకు ఎల్లవేళలా కొండా కుటుంబం అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు అన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు వరంగల్ తూర్పు నియోజకవర్గం ఓసిటీలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజలు కొండా మురళీధర్ రావును కలిసి తమ సమస్యలను పరిష్కరించాల్సిందిగా విజ్ఞప్తులు చేశారు. మురళీధర్ రావు ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంతవరకు సమస్యలను ఫోన్ లోనే పరిష్కరించారు. పలు సమస్యలపై అధికారులకు సూచనలు చేశారు. ప్రజలు ఏ సమస్యలున్నా తన దృష్టికి కానీ, మంత్రి సురేఖ దృష్టికి గాని తీసుకురావాలని ప్రజలకు ఎల్లవేళలా కొండా కుటుంబం అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు మరోమారు ప్రజలకు స్పష్టం చేశారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండల కేంద్రంలో వెటర్నర్ అసిస్టెంట్ గద్దల మైసయ్య తల్లి, గద్దల ఎల్లమ్మ శుక్రవారం అనారోగ్యంతో మరణించింది. వారి భౌతికాయానికి నెల్లికుదురు మాజీ జడ్పిటిసి హెచ్ వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రత్నపురం యాకయ్య , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులి వెంకన్న, పూలమాలవేసి ఘన నివాళులర్పించారు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారితో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు గడ్డం అరుణ్ కుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మరి కుంట్ల మౌనేందర్, జిల్లా యూత్ నాయకులు మద్ది రాజేష్, మాజీ ఎంపీటీసీ గుగులోతు నరేష్, గ్రామ ప్రధాన కార్యదర్శి ఆకుల నాగన్న, మండల ఓబీసీ అధ్యక్షులు ఆకుల నరసయ్య యాదవ్, గ్రామ ఉపాధ్యక్షులు ఆకుల కొమురెల్లి, మైనార్టీ గ్రామ అధ్యక్షులు ఎస్.కె అజ్గర్ అలీ, సట్ల యాకయ్య, మాజీ వార్డు సభ్యులు పులి శ్రీనివాస్, హెచ్ రంగస్వామి, డాక్టర్ వెంకటేశ్వర్లు, సలుగు హనుమంతు, బరిగెల సమ్మయ్య, బత్తిని మల్లయ్య, సలుగు వీరేషు, బూర్గుల రజిని, ఎండీ అమీర్ ఖాన్, శ్రీకాంత్, బొంబాయి, యాకన్న, దైద నరేందర్ పాల్గొని ఘన నివాళులర్పించారు

# ప్రైవేట్ హాస్పిటళ్లలో శ్రమ దోపిడీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కొన్ని ప్రైవేట్ హాస్పిటళ్లలో ఉద్యోగం చేసే అమ్మాయిలు, అబ్బాయిల శ్రమ దోపిడీ చేస్తున్నారని జాతీయ బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరి పవన్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పవన్ మాట్లాడుతూ కొన్ని ప్రైవేట్ హాస్పిటల్ లలో ఉద్యోగం చేసే చోట 8 గంటల కంటే ఎక్కువ డ్యూటీ చేపించుకుంటున్నారని మండిపడ్డారు. ఇలాంటి వాటిపై అధికారులు విచారణ చేపట్టి డీఎంహెచ్ఓ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# గుండె పోటుతో రైతు మృతి



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** చిట్యాల మండలంలోని గ్రామం దూత్ పల్లి నివాసి పులి లింగన్న వయస్సు 49 సంవత్సరాలు రెండు రోజుల క్రితం తెల్లవారుజామున గుండె పోటుతో మృతి చెందాడు. మంగళవారం తనకు ఉన్న వ్యవసాయ భూమి దగ్గరికి వెళ్లి పొలం చేసుకొని ఇంటికి వచ్చి అన్నం తిని పడుకోవడం జరిగింది. రాత్రి సమయంలో ఒక్కసారిగా గుండె నొప్పి లేస్తుందని చెప్పడంతో హాస్పిటల్ కు తీసుకుపోదాం అనుకునే సమయంలోనే గ్రామం ఉన్న డాక్టర్ వచ్చి చూసే సారికి చనిపోయాడని నిర్ధించడంతో మృతుడి కుటుంబ సభ్యులు శ్లోకా సంద్రంలో మునిగి పోయారు. గుండె పోటుతో మృతి చెందిన రైతు కుంటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులు, గ్రామస్థులు కోరుతున్నారు.

# సామూహిక వరలక్ష్మి వ్రతాలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వరలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వేలాది మంది భక్తుల నడుమ వేద పండితులు శాస్త్రోక్తంగా వేద మంత్రోచ్చారణల నడుమ విశేష అలంకరణలు వెల్లువెత్తిన భక్తి పరవశం మధ్య పసుపు కుంకుమలతో మహిళలచే వ్రతాలను చేయించారు. తొలుత వేద పండితులు గణపతి పూజ పుణ్యాహవచనం నిర్వహించి అమ్మవారి అష్టోత్తర శతనామ పూజలు ఆచరించారు. వేద పండితులు వరలక్ష్మి దేవి వ్రత కథను చదివి వినిపించారు. వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం వల్ల పసుపు కుంకుమలు చల్లగా ఉండి అష్ట ఐశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో జీవిస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రొద్దుటూరు కృష్ణకుమారి, భక్తురాలు, గీతా రాణి, సుజాత, శ్రీరంగ ఉమ్మడి జ్యోతి, శ్రావణి, రవికుమార్, కిషోర్, సుమారు 300మంది భక్తులు పాల్గొన్నారు.

# బీసీల వాటా పోరాటంలో న్యాయవాదులు ముందుండాలి

## వాల్ పోస్టర్ ఆవిష్కరించిన ఐఎల్‌పీఏ నాయకులు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సకల సామాజిక రంగాల్లో జనాభా దామాషా ప్రకారం బీసీల వాటా సాధన పోరాటంలో బీసీ న్యాయవాదులు ముందుండాలని ఐఎల్ పీఏ రాష్ట్ర నాయకులు పొన్నం దేవరాజ్ గౌడ్ అన్నారు. బీసీ హక్కుల సాధన ఉద్యమంలో బీసీ న్యాయవాదులను భాగస్వాములను చేయడం కోసం ఈ నెల 25న హైదరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర స్థాయి బీసీ న్యాయవాదుల సదస్సును జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ లో బార్ ప్రధాన కార్యదర్శి లడే రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు దాటినా 60 శాతం పైగా జనాభా కలిగిన బీసీ ప్రజలకు ఇంకా న్యాయం జరగడం లేదన్నారు. బ్రిటిష్ కాలంలో జరిగిన జనగణన తర్వాత ఇప్పటికీ జనగణన జరగలేదని, కుల జనగణన కోసం రాహుల్ గాంధీ పార్లమెంటులో డిమాండ్ చేస్తున్నప్పటికీ ఆ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో కుల జనగణన చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి లడే రమేష్, సీనియర్ న్యాయవాదులు పులి సత్యనారాయణ, దయాల సుధాకర్, జంగా స్వప్న, రమాదేవి, రంజిత్ గౌడ్ మాట్లాడుతూ కాకా కలెక్కర్, మండల్ కమిషన్ లాంటివి ఎన్ని నివేదికలు ఇచ్చినా, ఎన్ని పోరాటాలు చేసినా ప్రధాన రంగాలైన న్యాయ వ్యవస్థ, రాజకీయ, ఆర్థిక వ్యవస్థల్లో నేటికీ బీసీలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. సామాజిక న్యాయ సమరంలో రాజ్యాంగం, చట్టం తెలిసిన న్యాయవాదులు ముందుండాలని, బీసీ సమాజం ఐక్యతగా సాగి చట్టసభల్లో, న్యాయ వ్యవస్థలో వారి వాటా వారు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 25న హైదరాబాద్ లో జరుగు బీసీ న్యాయవాదుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయడంలో హనుమకొండ న్యాయవాదులు ముందుండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎల్ పీఏ రాష్ట్ర నాయకులు మాధవ కృష్ణ, సాయిని నరేందర్, నరహరి, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్, హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జంగా స్వప్న, కార్యనిర్వహక సభ్యురాలు రమాదేవి, మాజీ ప్రదాకార్యదర్శి గునిగంటి శ్రీనివాస్, న్యాయవాదులు పులి సత్యనారాయణ, దయ్యాల సుధాకర్, యుగేందర్, జలజ, బాసాని ఉమాదేవి, గుర్రాల వినోద్ కుమార్, అనిల్ యాదవ్, పాము శరత్, కూనూరు రంజిత్ గౌడ్, రాజేష్, రాజన్ బాబు, రాజ్ కుమార్, సాగర్ గౌడ్, సుందర్ రామ్, జిలకర శ్రీనివాస్, భిక్షపతి, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు

# అధికారం పోయిన కేటీఆర్‌కు అహం తగ్గలేదు

## కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్



వరంగల్ వాయిస్, ములుగు : జిల్లా కేంద్రంలో టీపీసీసీ పిలుపు మేరకు రాష్ట్ర మంత్రి డాక్టర్ సీతక్క ఆదేశాల మేరకు నిన్న కేటీఆర్ మహిళల పట్ల చేసిన వాఖ్యలు నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పైడాకుల అశోక్ మాట్లాడుతూ కేటీఆర్ కు అధికారం పోయిన తన అహం తగ్గలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు ఉచిత బస్ ప్రయాణం అందిస్తే కళ్లు ఓర్వని బీఆర్ఎస్ నాయకులు ఇష్టమున్నట్లు మాట్లాడుతున్నారని, నిన్న మహిళల పట్ల కేటీఆర్ చేసిన వాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గడిచిన 8 నెలలుగా పేద ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం పని చేస్తుందని, ఇప్పటికే ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం మూడు దఫాలుగా 2 లక్షల రుణమాఫీ చేసిందని మహిళకు ఉచిత బస్ ప్రయాణంతో పాటు రూ.500కే గ్యాస్ సిలిండర్ ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళా సాధికారతే లక్ష్యంగా మా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కొంత మంది బీఆర్ఎస్ కుక్కలు సోషల్ మీడియాను అడ్డుపెట్టుకొని మా నాయకురాలిపైన ట్రోలింగ్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. సిగ్గు లేని వెధవలకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేరస్తులను కఠినంగా శిక్షించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కోల్ కత్తా ఆర్ జీ కార్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ లో సీనియర్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ స్టూడెంట్‌ను అమానుషంగా అత్యాచారం, హత్య చేసి పొట్టనబెట్టుకున్నారు. 36 గంటల పాటు నిర్విరామంగా డ్యూటీ చేసి విశ్రాంతి కోసం వెళ్లిన ఆమెపై అత్యాచారం చేసి చంపేసారు. సామూహిక అత్యాచారం, క్రూరమైన హత్యగా పోస్ట్ మార్టం రిపోర్టులో వెల్లడైనా ప్రభుత్వం నిందితులను కఠినంగా శిక్షించకుండా చోద్యం చూస్తుంది. పై దుర్గటన దురాగతానికి గురైన ఒక్క వైద్యార్థినిదే కాదు. నేడు దేశం అంతటా పీజీ స్టూడెంట్స్, మెడికల్ స్టూడెంట్స్, జూనియర్ డాలర్లు అనుభవిస్తున్న దుర్మార్గ పరిస్థితులను తెలియజేస్తుంది. పెద్ద పెద్ద హాస్పిటళ్లలో కూడా డాక్టర్లకు అవసరమైన విశ్రాంతి గదులు ఉండటం లేదు. పేషంట్లకు తగినట్లుగా డాక్టర్లను, పారామెడికల్ సిబ్బందిని ప్రభుత్వం నియమించదు. దీని వలన జూనియర్ డాక్టర్లు 24 గంటలు, 36 గంటలపాటు అధిక పనిగంటలు పనిచేయాల్సి వస్తుంది. ప్రభుత్వం మహిళా డాక్టర్లు, మహిళా ఉద్యోగుల రక్షణ కోసం ప్రత్యేకమైన చర్యలేవీ తీసుకోడం లేదు. హాస్పిటల్ నిర్వహనకు సంబంధించి వివిధ విభాగాలతో పాటుగా సెక్యూరిటీ విభాగం కూడా ప్రయివేటు వ్యవస్థ చేతిలోనే ఉంది. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ, కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంభిస్తున్న ప్రభుత్వం వైద్య వ్యవస్థ పట్ల దారుణమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంది. పై అంశాలన్నీ ప్రభుత్వ హాస్పిటళ్లలో అభద్రతా పరిస్థితులకు, డాక్టర్ల పట్ల దాడులకు కారణంగా ఉన్నాయి. కాబట్టి, ఘటనలు జరిగినప్పుడు మాత్రమే కాకుండా మహిళలపై అనునిత్యం జరుగుతున్న వేధింపులు, హింస, లైంగిక దాడులు, హత్యలకు కారణమవుతున్న నేర వ్యవస్థను అరికట్టడానికి ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. మహిళా డాలర్లకు రక్షణ కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం మహిళా డాక్టర్‌ల రక్షణ కోసం చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

# ఘనంగా వరలక్ష్మి వ్రతం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని అతి పురాతనమైన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో శ్రావణమాస పౌర్ణమి ముందు వచ్చే రెండవ శుక్రవారం సకల సౌభాగ్యప్రదమైన వరలక్ష్మి వ్రతాన్ని దేవాలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి ఘనంగా నిర్వహించారు. దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి పూజా కార్యక్రమం ఏర్పాట్లు చేశారు. అర్చకులు మొదట గణపతి పూజ, శ్రీ మహాలక్ష్మి దేవి, అష్టోత్తరాలు, పసుపు కుంకుమ పూలతో కలశరాధన చేసి వరలక్ష్మి పూజను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 18న సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని ఘనంగా జరపాలి

## వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్



**వరంల్ వాయిస్, హనుమకొండ :** ఆగస్టు 18న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ రాష్ట్ర ఉత్సవ కమిటీ కన్వీనర్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ 350 సం. క్రితమే నిజాం నిరంకుశ పాలనను ఎదిరించుటకు తన చుట్టూ ఉన్న బహుజన కులాలతో సైన్యాన్ని తయారు చేసుకుని నిజాం రాజు పైన దండయాత్ర చేసి అనేక కోటలు కూలగొట్టి చివరికి గోల్కొండ కోటను వశపర్చుకొని రాజ్యస్థాపన చేసిన గొప్ప బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. అలాంటి వీరుడి జయంతిని రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 18న రవీంద్రభారతిలో అధికారకంగా చేపడుతున్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ హాజరవుతున్నారు. కాబట్టి, వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి గౌడ, బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని వడ్లకొండ వేణుగోపాల్ రోడ్ పిలుపునిచ్చారు.

# ఫెర్టిలైజర్ డీలర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా పమ్మిడి సాగర్ రావు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండల ఫెర్టిలైజర్ డీలర్స్ అసోసియేషన్ ఎన్నిక శుక్రవారం జరిగింది. అధ్యక్షుడిగా పమ్మిడి సాగర్ రావు, గౌరవ అధ్యక్షులుగా పగడాల గట్టయ్య, తొగరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా తాళ్ల రాజేందర్, కోశాధికారిగా అల్లాడి సురేష్, ప్రధాన కార్యదర్శిగా బొమ్మ రమేష్ రెడ్డి, సమాచార సంయుక్త కార్యదర్శిగా బుర్ర సుధాకర్ ఎన్నికయ్యారు.

# ఓబీసీ స్టేట్ కోఆర్డినేటర్‌గా దామోదర్ గౌడ్



**వరంగల్ వాయిస్, రేగొండ :** తెలంగాణ రాష్ట్ర ఓబీసీ స్టేట్ కోఆర్డినేటర్ గా తాళ్లపల్లి దామోదర్ గౌడ్ నియమితులయ్యారు. శుక్రవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా నియామక పత్రాన్నిఅందుకున్నారు. ఈ సందర్భంగా దామోదర్ గౌడ్ మాట్లాడుతూ నన్ను గుర్తించి ఈ పదవికి నియామకం చేసినందుకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు, అలాగే జిల్లా నాయకులకు ఎంతో రుణపడి ఉంటానని, ఎమ్మెల్యే అడుగుజాడల్లో నడుస్తూ నిత్యం పార్టీ కృషికి, ఎమ్మెల్యే సహకారంతో ప్రజల అభివృద్ధికి తోడ్పడతానని అన్నారు.

# పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటాలి



**వరంగల్ వాయిస్, మొగుళ్లపల్లి :** రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తెలంగాణలోని అన్ని గ్రామాల్లో వార్డు మెంబర్ నుంచి సర్పంచ్ వరకు నాయిబ్రాహ్మణ కులస్తులు పోటీ చేసి రాజకీయ సత్తా చాటాలని జిల్లా యువశక్తి నాయి బ్రాహ్మణ సేవా సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు మురహరి నిరంజన్ నాయి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధనవంతులు, బలవంతులు, పెత్తందారులు మన కులాన్ని తరతరాల నుంచి అణిచివేస్తున్న బూర్జువా వర్గాల కబంధహస్తాల నుంచి విముక్తికై నాయి బ్రాహ్మణులు స్థానిక సంస్థల ఎన్నికలే ఏజెండాగా ముందుకు సాగాలన్నారు. రాజకీయ గుర్తింపు లేనిదే హక్కుల సాధన అసాధ్యమని, కాబట్టి, మన సోదరీ, సోదరులు సమన్వయంతో మన ఉనికిని నిరూపించేందుకు ఎన్నికలలో ఓడిన, గెలిచిన మన కుల గుర్తింపు కోసం పోరాడాలన్నారు. ఎన్నికలే తొలిమెట్టుగా భావించి రాజ్యాధికారంలో వాటాకై.. అభ్యుదయ భావాలు కలిగిన మన కులాన్ని గుర్తించే వారి సహాయ, సహకారాలతో ఎన్నికలలో పోటీ చేయాలని నాయి బ్రాహ్మణ కులస్తులకు నిరంజన్ నాయి పిలుపునిచ్చారు.

# మాజీ ప్రధాని వాజ్ పేయికి ఘన నివాళి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** భారత మాజీ ప్రధాని వాజ్పేయి వర్ధంతిని కాశిబుగ్గ చౌరస్తాలో బిజెపి శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా వాజ్పేయి చిత్రపటానికి పూలమాలవేసి బీజేపీ రాష్ట్ర నాయకులు సముద్రాల పరమేశ్వర్ మాట్లాడుతూ అజాతశత్రువుగా పేరుపొందిన వాజ్ పేయి జన్మదినాన్ని భారత ప్రభుత్వం సుపరిపాలన దినోత్సవంగా జరుపుకుంటున్నారు. రాజ్యసభ సభ్యుడిగా, లోక్‌సభ సభ్యుడిగా, దేశ ప్రధానిగా దేశానికి విశేష సేవలు అందించిన వాజ్ పేయి సేవలను గుర్తించి భారత ప్రభుత్వం 2015లో భారత అత్యున్నత పురస్కారం భారతరత్నతో సత్కరించారు. ఉత్తమ ఉత్తమ పార్లమెంటేరియన్ గా గుర్తింపు పొందిన వారి జీవితం ఈ తరం నాయకులకు మార్గదర్శనమని కొనియాడారు. ఈ సందర్భంగా వారి భారీ విగ్రహాన్ని కాశిబుగ్గ జంక్షన్ లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అతి త్వరలో నెలకొల్పుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధోజు శ్రీనివాస్, మార్టిన్ లూథర్, కోట సతీష్, రాఘువాచారి, సిరిమల్లె తిలక్, అల్లి అజయ్, బొడ్డు రాకేష్, బైరి హరీష్, ముచ్చర్ల ప్రభాకర్, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

# బాలివుడ్‌పై కన్నేసిన శ్రీలీల

కథల ఎంపికలో జోరు చూపిస్తోంది అందాల తార శ్రీలీల. ఇప్పటికే 'భగవంత్ కేసరి', 'గుంటూరు కారం' లాంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఈమె.. ఇప్పుడు బాలీవుడ్‌లోనూ తన నటనను నిరూపించుకోవడానికి సిద్ధమైంది. బాలీవుడ్ కథానాయకుడు సిద్దార్థ్ మల్హోత్రా 'మిట్టి' అనే చిత్రంలో నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. బల్వీందర్ సింగ్ దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పుడీ సినిమాలో కథానాయికగా శ్రీలీల ఎంపికైనట్లు సమాచారం. 'కుటుంబ భావోద్వేగాలతో కూడిన యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. ఈ కథ విన్న వెంటనే సిద్దార్థ్ సరసన నటించడానికి అంగీకారం తెలిపింది శ్రీలీల. ఈ చిత్రంతో తన బాలీవుడ్ ప్రయాణం ప్రారంభం కాబోతున్నందుకు చాలా ఉత్సాహంగా ఉందీమె. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా చిత్రీకరణను అక్టోబరులో మొదలు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నార'ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం 'రాబిన్‌హుడ్', 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమాలతో బిజీగా ఉంది శ్రీలీల.





# తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన రజిషా విజయన్

తనదైన నటనతో తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది రజిషా విజయన్. కోలీవుడ్ స్టార్ కార్తి హీరోగా నటించిన 'సర్దార్' చిత్రంలో ఆమె పోషించిన పాత్రకు మంచి గుర్తింపు వచ్చింది. ప్రస్తుతం తెరకెక్కుతోన్న 'సర్దార్2'లోనూ రజిషా కీలక పాత్ర పోషిస్తోందని మేకర్స్ గురువారం ప్రకటించారు. ఆమెకు వెల్‌కమ్ చెబుతూ స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. పిఎస్ మిత్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఎస్ జే సూర్య మరో ప్రముఖ పాత్ర చేస్తున్నాడు. ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ లక్ష్మణ్ కుమార్ నిర్మిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుగుతోందని, భారీ బ్జడెట్‌తో రూపొందిస్తున్నట్టు నిర్మాత తెలియజేశారు. యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నాడు. రెండేళ్ల క్రితం వచ్చిన 'సర్దార్' సక్సెస్ అందుకోవడంతో సీక్వెల్‌పైనా అంచనాలు ఏర్పడ్డాయి.



# మరో సినిమాపై చిరు దృష్టి

కథానాయకుడు చిరంజీవి ప్రస్తుతం 'విశ్వంభర'తో సెట్స్‌పై గడుపుతున్న సంగతి తెలిసిందే. వశిష్ఠ తెరకెక్కిస్తున్న ఈ సోషియో ఫాంటసీ థ్రిల్లర్ ఇప్పటికే ముగింపు దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలోనే దీని తర్వాత చిరు చేయనున్న ప్రాజెక్ట్ ఏదన్నది అందరిలో ఆసక్తి రేకెత్తిస్తోంది. అయితే ప్రస్తుతం సినీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం మోహన్‌రాజా దర్శకత్వంలో చిరు ఓ సినిమా చేసేందుకు పచ్చజెండా ఊపినట్లు తెలుస్తోంది. దీనికి బి.వి.ఎస్ రవి కథ అందిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ స్క్రిప్ట్ పనులు ముగింపు దశకు చేరుకున్నాయని.. ఈ ఏడాదిలోనే ఈ చిత్రాన్ని పట్టాలెక్కించనున్నారని వార్తలొస్తున్నాయి. నిర్మాతగా చిరు తనయ సుస్మిత కొణిదెల వ్యవహరించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నెల 22న చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌పై స్పష్టత వచ్చే అవకాశముంది.

# ఫ్రెంచ్ హీరో లూకాస్ బ్రావో ప్రశంసలు

భారతీయ సినిమా స్థాయిని ప్రపంచానికి చాటి చెప్పిన చిత్రం 'ఆర్‌ఆర్‌ఆర్'. ఈ సినిమాతో రామ్ చరణ్ , ఎన్టీఆర్‌లకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. పలువురు హాలీవుడ్ ప్రముఖులు గతంలో ఈ సినిమాను ప్రశంసించగా.. తాజాగా ఫ్రెంచ్ హీరో లూకాస్ బ్రావో.. రామ్ చరణ్‌ను మెచ్చుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియోను ఆయన అభిమానులు షేర్ చేస్తున్నారు. దీంతో ఎక్స్‌లో 'ఆర్‌ఆర్‌ఆర్' పేరు దేశవ్యాప్తంగా ట్రెండింగ్‌లోకి వచ్చింది. ఆర్‌ఆర్‌ఆర్'లో మెయిన్ హీరో రామ్ చరణ్ నటన అద్భుతం. ఎంట్రీ సీన్, ఎమోషనల్ సన్నివేశాల్లో బాగా నటించారు. యాక్షన్ సీక్వెన్స్‌లలోనూ ఆకట్టుకున్నారు' అని ప్రశంసించారు. ఎస్.ఎస్.రాజమౌళి ( దర్శకత్వంలో రామ్‌చరణ్, ఎన్టీఆర్ కథానాయకులుగా నటించిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా '2022లో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రూ.1300 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఆస్కార్ అవార్డుల్లోనూ సత్తా చాటిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్'తో బిజీగా ఉన్నారు. శంకర్ దర్శకత్వంలో పొలిటికల్, యాక్షన్ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ కథాంశంతో సిద్ధమవుతోంది. ఇందులో రామ్ చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నట్లు సమాచారం.




# మహిళలకు క్షమాపణ చెప్పాలి

## కేటీఆర్ దిష్టి బొమ్మ దహనం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** మహిళలకు ఉచిత బస్ ప్రయాణంపై వారిని కించపరుస్తూ బస్ లలో బ్రేక్ డ్యాన్సులు, రికార్డింగ్ డ్యాన్సులు చేయండి అంటూ అత్యంత అవహేళనగా మాట్లాడిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మహిళలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. మహిళల పట్ల అవమానకరంగా మాట్లాడి వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసిన కేటీఆర్ వైఖరిని నిరసిస్తూ శుక్రవారం వరంగల్ పోచమ్మ మైదాన్ సెంటర్ లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్, కార్పొరేటర్ గుండేటి నరేందర్, మాజీ కార్పొరేటర్లు కత్తెర లక్ష్మణ్, ధూపం సంపత్, జన్ను రవి, ఓబీసీ జనరల్ సెక్రెటరీ వరుణ్, యూత్ కాంగ్రెస్ పరమేష్, గిన్నారపు రాజు, జన్ను ఆదాం, ఐఎన్ టీయూసీ చంద్రమౌళి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# న్యాయవాదులకు అండగా ఉంటా

## మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఇటీవల నూతనంగా ఎన్నికైన వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్, కమిటీ న్యాయవాదులు శుక్రవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొండా మురళీదర్ రావు మాట్లాడుతూ నూతన చైర్మన్ శామంతుల శ్రీనివాస్ తో పాటు కమిటీని అభినందించారు. బాధ్యతా యుతంగా పని చేసి కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు తేవాలన్నారు. న్యాయవాదుల సమస్యలను పరిష్కరించుటలో అన్ని విధాలా పార్టీ అండగా ఉంటుందని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ ముదసిర్ అహ్మద్, వరంగల్ జిల్లా కన్వీనర్ కొక్కొండ రమేష్, ఈ.ఆనంద్ మోహన్, గునిగంటి శ్రీనివాస్ గౌడ్, గంప వెంకట రమణ, గన్ను హరిహర కుమార్, అమృతరావు, అజమ్, పెరుకు సుఖష్, శ్రీకాంత్, గంద్రతి శ్రీధర్, పరమెశ్వర్, మండల పరశురాములు, కృష్ణ, రాజు, ఆనంద్, వైస్ చైర్మన్లు, జాయింట్ కన్వీనర్లు పాల్గొన్నారు.



## సోషల్ వర్కర్ అవార్డ్ అందుకున్న పెరుమాండ్ల

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు ఉత్తమ సోషల్ వర్కర్ అవార్డు అందజేవారు. గురువారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండ సురేఖ, కలెక్టర్ ప్రావీణ్య, కమిషనర్ అశ్విని తానాజీ వాఖడే, సీపీ అంబర్ కిషోర్ ఝా చేతుల మీదుగా రామకృష్ణ ఈ అవార్డును అందుకున్నారు.

## మొట్లపల్లిలో పడకేసిన పారిశుద్ధ్యం

### చెత్త, చెదారంతో నిండుకున్న గ్రామం

**వరంగల్ వాయిస్, మొగుళ్లపల్లి :** గ్రామపంచాయతీలలో సర్పంచుల పదవీకాలం పూర్తి కావడంతో గ్రామ పంచాయతీల పరిస్థితి అధ్వానంగా మారింది. గ్రామంలోని సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోవడంతో సమస్యలకు నిలయాలుగా గ్రామపంచాయతీలు మారాయి. దీంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని మొట్లపల్లి గ్రామం మరింత అస్తవ్యస్తంగా మారిపోయింది. మొట్లపల్లి గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసినప్పటికి.. అధికార యంత్రాంగం ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొట్లపల్లి-జమ్మికుంటకు వెళ్లే ప్రధాన రహదారి ప్రక్కన గల జడ్పీహెచ్ఎస్ ప్రహరీ గోడను ఆనుకొని చెత్త, చెదారాన్ని డంప్ చేసిన పట్టించుకునే నాధుడే లేకపోవడంతో..ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయని, దీంతో విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజలు విష జ్వరాల బారీన పడుతున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## పోస్ట్ మరిపెడలో.. విధులు పైడిపల్లిలో

# హెల్త్ డైరెక్టర్ ఉత్తర్వులు బుట్టదాఖలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వైద్య శాఖలో పాలన గాడితప్పుతోంది. హెల్త్ డైరెక్టర్ ఉత్తర్వులను సైతం మెడికల్ ఆఫీసర్లు, ఫార్మసిస్టులు బుట్ట దాఖలు చేస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఒక ఫార్మసిస్ట్ ను మరిపెడకు బదిలీ చేసి సదరు మెడికల్ ఆఫీసర్ కు మెయిల్ పెట్టినా అవేమీ పట్టించుకోకుండా పైడిపల్లిలోనే విధులు నిర్వహిస్తూ హెల్త్ డైరెక్టర్ కే సవాల్ విసురుతున్న వైనం వైద్య శాఖలో నెలకొంది. ప్రభుత్వ జీఓ నెంబర్ 80 ప్రకారం ఫోకల్ నుంచి ఫోకల్ కు ఎవరిని బదిలీ చేయకూడదు. అయినప్పటికీ వైద్య ఆరోగ్య శాఖలో ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఎంజీఎంలో పని చేస్తున్న ఫార్మసిస్ట్ సుచరితను పైడిపల్లి పీహెచ్ సీకి బదిలీ చేశారు. నిబంధనలకు విరుద్దంగా జరిగిన ఈ ట్రాన్స్ఫర్ పై కొందరు ఫార్మసిస్టులు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో సుచరితను వెంటనే పైడిపల్లి నుంచి మరిపెడ పీహెచ్ సీకి బదిలీ చేస్తూ 31 జులై 2024న డైరెక్టర్ ఆఫ్ హెల్త్ మరో ఉత్తర్వు ఇచ్చింది. ఇట్టి ఉత్తర్వుల ప్రకారం ఫార్మసిస్ట్ ను మరిపెడకు పంపించాలి. కానీ డైరెక్టర్ ఉత్తర్వులను లెక్క చేయకుండా మెడికల్ ఆఫీసర్ చట్ట విరుద్దంగా వ్యవహరిస్తూ పైడిపల్లిలోనే విధులు నిర్వహించేందుకు సహకరిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. వరంగల్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకట రమణ సైతం మెడికల్ ఆఫీసర్ కు స్వయంగా ఫోన్ చేసి ఫార్మసిస్ట్ సుచరితను పైడిపల్లిలో విధులకు రాకుండా చూడాలని, ఆమెను మరిపెడకు పంపించమంటూ మెయిల్ ద్వారా కూడా సమాచారం ఇచ్చినా వాటిని పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. సదరు మెడికల్ ఆఫీసర్ కొన్ని ప్రలోభాలకు లొంగి ఫార్మసిస్ట్ ను పైడిపల్లిలోనే విధుల్లో కొనసాగిస్తున్నారని పలువురు ఫార్మసిస్టులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సదరు మెడికల్ ఆఫీసర్ పై విచారణ జరిపించి, క్రమ శిక్షణ చర్యలు తీసుకోవడంతోపాటు ఫార్మసిస్ట్ సుచరితను వెంటనే మరిపెడకు పంపించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.









# వీరే బెస్ట్ ఫొటోగ్రాఫర్స్

### అవార్డులకు ఎంపికైన నలుగురు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర సమాచార, పౌరసంబధాల శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ పరిధిలోని నలుగురు సీనియర్ ఫొటోగ్రాఫర్లు బెస్ట్ ఫొటోగ్రఫీ అవార్డులకు ఎంపికయ్యారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు, ది హన్స్ ఇండియా ఫొటోగ్రాఫర్ గోకారపు శ్యాంకుమర్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుడు, ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ వీరగోని హరీష్, నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్ మేరుగు ప్రతాప్, మన తెలంగాణ ఫొటోగ్రాఫర్ కుడుతుల రమేష్ కు అవార్డులు దక్కాయి. వీరికి గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బొల్ల అమర్ తో పాటు కార్యవర్గం, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, నెట్ వర్క్ ఇంచార్జి సామల సూర్యప్రకాశ్, డెస్క్ ఇంచార్జి గోలి రవి తదితరులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## క్యాంటీన్ పనులు పూర్తి చేయండి : గుండు సుధారాణి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహా నగరపాలక సంస్థ పరిధిలోని క్యాంటిన్ మరమత్తు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయ అవరణలో ఏర్పాటు చేస్తున్న ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ మరమత్తు పనులను మేయర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమర్థవంతంగ నిర్వహించుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్యాంటీన్ పనులలో వేగం పెంచాలని, లోపలి వైపు ఫ్లోరింగ్ తో పాటు లైటింగ్ ఏర్పాటు చేయాలని, గోడలపై క్యాంటీన్ ను తెలియజేసే చిత్రాలను ప్రదర్శించేలా వేయించాలని, క్యాంటీన్ ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసందించాలని, క్యాంటీన్ వద్ద గల చెట్లను, రాళ్ళను వివిధ రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, క్యాంటీన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సీఎంహెచ్ఓను మేయర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, టీపీఆర్ఓ కోల రాజేష్ కుమార్ గౌడ్, టీఓ బిర్రు శ్రీనివాస్, టీఎంసీ రమేష్, ఏఈ రాగి శ్రీకాంత్ పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com